

మాగనూరు పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్



తమ ఇండ్ల నుంచి తెచ్చుకున్న లంచ్‌బాక్సులను చూపుతున్న మాగనూర్ పాఠశాల విద్యార్థులు

# స్కూళ్లా.. యమకూపాలా?

- మాగనూరు బడిలో తగ్గిన హాజరు శాతం
- మదనాపురంలో విద్యార్థి ఆత్మహత్య
- సీఎం సొంత జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదవాలంటేనే జంకుతున్న విద్యార్థులు
- విపక్షాలపై పోలీసుల జులుం, మాజీ ఎమ్మెల్యే చిట్టెం అరెస్ట్
- మాగనూరులో 144 సెక్షన్
- మేం కుర్‌కురే తిన్నమని ఎట్ల చెప్పిండ్రు?
- మక్తల్ ఎమ్మెల్యేను నిలదీసిన విద్యార్థులు
- 'మాగనూరు'పై నివేదిక కోరిన హైకోర్టు

మహబూబ్‌నగర్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తిందామంటే భయం.. గురుకులాల్లో ఉందామంటే భయం.. కేజీబీవీలో చదవాలంటే భయం.. ఇదీ ఇవాళ రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాగనూరు జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం సగానికిపైగా హాజరుశాతం తగ్గిపోయింది. జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎడ్యుకేషనల్ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, ఇతర ఉన్నతాధికారులు దగ్గరుండి మధ్యాహ్న భోజనాన్ని వండించాల్సిన పరిస్థితి నెలకొన్నది. వనపర్తి జిల్లా మదనాపురం గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి ప్రవీణ్ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపింది. నవాబ్‌పేట మండలంలో కేజీబీవీ విద్యార్థిని జల్సా చేత పూరీలు చేయిస్తుండగా, కాగుతున్న నూనె మీద పడి గాయాలయ్యాయి. మరోవైపు మాగనూరులో పోలీసులు 144 సెక్షన్ విధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. నారాయణపేట జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేశారు. పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు. జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు పాఠశాలలో ఉండటంతో మీడియాను తప్ప ఎవరినీ లోపలికి అనుమతించలేదు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులు తమను పరామర్శించేందుకు వచ్చిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని నిలదీశారు. ఫుడ్ పాయిజన్ అయిన మాగనూరు ఉన్నత పాఠశాల ఘటనపై బీఆర్‌ఎస్ నేతలు ఆందోళన చేస్తారని భావించిన పోలీసు యంత్రాంగం తెల్లవారు జామునే మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని అరెస్ట్ చేసి మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు, విపక్షాలు చేపట్టిన ఆందోళనలను సైతం భగ్నం చేసి 42 మందిని అరెస్ట్ చేశారు. నారాయణపేట జిల్లా మాగనూరు ఘటనపై హైకోర్టు సీరియస్ అయింది. ప్రభుత్వాన్ని నివేదిక కోరింది. ఇది ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న పరిస్థితి. విద్యార్థులను స్కూలుకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో బుధవారం జరిగిన వరస ఘటనలు ప్రభుత్వ విద్యాసంస్థల పనితీరుకు అద్దం పడుతుండగా సీఎం సొంత జిల్లాలో జరుగుతున్న ఘటనలు కలవర పెడుతున్నాయి.



మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని అరెస్టుచేసి మదూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన పోలీసులు

## మక్తల్ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

**మాగనూరు** ఫుడ్‌పాయిజన్ ఘటనపై స్పందించి విద్యార్థులను పరామర్శించిన మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని తెల్లవారుజామున మక్తల్‌లో అరెస్టు చేశారు. ఉదయం 5 గంటలకు ఇంటి కి వెళ్లిన పోలీసులు మాజీ ఎమ్మెల్యేను అరెస్టు చేసి మద్దూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అప్పటికే చేరుకున్న బీఆర్‌ఎస్ నేతలు మాజీ ఎమ్మెల్యే అరెస్టును అడ్డుకున్నారు. అయినప్పటికీ పోలీసులు బలవంతంగా ఆయనను వాహనంలో తరలించారు. మాజీ ఎమ్మెల్యే అరెస్ట్‌కు నిరసనగా జాతీయ రహదారిపై ఆ పార్టీ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో మక్తల్ పోలీసులు రంగంలోకి దిగి బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మాగనూరులో పోలీసులు 144 సెక్షన్ విధించి ఆందోళనకు దిగిన బీఆర్‌ఎస్, ఏబీవీపీ, పీడీఎస్‌యూ, బీజేపీ నేతలను అదుపులోకి తీసుకొని 42 మందిపై కేసు నమోదుచేశారు. పాఠశాల ముందు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పరిస్థితిని సమీక్షించారు.

### సగానికి తగ్గిన హాజరు శాతం

నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం 590 మంది విద్యార్థులకుగాను 330 మంది మాత్రమే హాజరయ్యారు. మంగళవారం 460 మంది విద్యార్థులు హాజరుకాగా.. మళ్లీ ఫుడ్‌పాయిజన్ అయ్యి 40 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో చాలామంది విద్యార్థులు పాఠశాలకు రాలేదు. వచ్చిన విద్యార్థుల్లో సగం మంది ఇంటి నుంచే టిఫిన్ బాక్సులు తీసుకొనిరావడం కనిపించింది.

### 12:57కు భోజనానికి వదిలిన ఉపాధ్యాయులు

రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వెంకట నరసింహారెడ్డి.. కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతమ్‌తో కలిసి మాగనూరు పాఠశాల పరిసరాలను బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి వాడిన బియ్యాన్ని, వంట గదిని పరిశీలించారు. నాణ్యమైన వస్తువులను వాడుతున్నారా? లేదా అనే విషయంపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 12:30 గంటలు దాటినా విద్యార్థులకు భోజనం పెట్టలేదు. దీంతో 12:45కు ఏడో తరగతి విద్యార్థిని అను ఆకలితో క్లాస్‌రూంలో బాధపడుతుండగా డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి గుర్తించి పాఠశాల బయటకు తీసుకెళ్లారు. సదరు విద్యార్థిని ప్రజలను చూసి భయభ్రాంతులకు గురై తిరిగి క్లాస్‌రూంకు వెళ్లి ఆకలితోనే కూర్చున్నది. అధికారులు ఫుడ్‌పాయిజన్‌పై గంటల తరబడి సమీక్ష జరుపుతున్నారే కానీ, సమయానికి భోజనం పెట్టాలన్న ధ్యాస లేకుండా పోయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చివరికి 12:57కు విద్యార్థులను భోజనానికి వదిలారు.

### ఐదుగురితో కమిటీ వేసిన కలెక్టర్

మాగనూరు ఫుడ్‌పాయిజన్ నేపథ్యంలో చర్యలు ప్రారంభమయ్యాయి. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించేందుకు జిల్లా కలెక్టర్ ఐదుగురితో కూడిన కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీలో స్థానిక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట ఏజెన్సీకి చెందినవారు ఉంటారు. ప్రతిరోజూ భోజనం ప్రారంభమయ్యే ముందు సరుకులన్నీ పరిశీలించాక భోజనాన్ని వండుతారు. ముందుగా కమిటీ సభ్యులు తిన్నాక విద్యార్థులకు భోజనం అందజేస్తారు. కాగా ఫుడ్‌పాయిజన్‌కు గల కారణాలపై అధికారులు విచారణ చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

### ఇంటి నుంచి భోజనం

మాగనూర్ పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కావడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు. బుధవారం ఉదయం స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు ఇంటినుంచే లంచ్ బాక్సులు తెచ్చుకున్నారు. వాటినే మధ్యాహ్నం భుజించారు. వారిని 'నమస్తే తెలంగాణ' బృందం పలకరించగా వారం రోజులుగా ఫుడ్ పాయిజన్ అవుతుండటంతో అన్నం తినాలంటేనే భయమేస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. పాఠశాలలో 590 మందికి 338 విద్యార్థులు హాజరు కాగా.. చాలామంది ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్నే తిన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు


మాగనూరు జడ్పీహెచ్‌ఎస్‌లో వరుస ఫుడ్‌పాయిజన్ ఘటనలపై జిల్లా కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. ఎందుకిలా జరుగుతున్నదని అధికారులపై మండిపడ్డారు. బియ్యం ఇతర వస్తువులు అన్నీ మార్చినా ఎందుకు విద్యార్థులకు వాంతులు, విరోచనాలు అవుతున్నాయని ప్రశ్నించారు. దీనికి గల కారణాలను వివరించాలంటూ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాగా, జిల్లా కలెక్టర్ వెంటనే సీసీ కెమెరాలు తెప్పించి బిగించారు. క్లాస్ రూములు, వంటగదులు, పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పరిస్థితి అంతా సవ్యంగా ఉన్నదని మీడియాతో వివరించారు.

### మేం కుర్‌కురే తిన్నమని ఎట్ల చెప్పిండ్రు?

#### ఎమ్మెల్యేను నిలదీసిన విద్యార్థులు

ఫుడ్‌పాయిజన్‌తో తీవ్ర అస్వస్థతకు గురై మహబూబ్‌నగర్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు బయట చిరుతిళ్లు తిన్నారని వ్యాఖ్యానించారు. దీంతో 'మేము బయట ఫుడ్ తినలేదు. మీరు అలా ఎందుకు చెప్పారు? మేం కుర్‌కురే తిన్నమని ఎట్ల చెప్పిండ్రు?' అంటూ విద్యార్థినులు ఎమ్మెల్యేను నిలదీశారు. తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఆయన బయటికి వచ్చి మీడియాతో సందర్భం లేని మాటలు మాట్లాడి వెళ్లిపోయారు.

## లోకం పోకడ




ఈ గంట పిల్లల కోసం కాదు.. టీచర్లు, అధికారులు నిద్రలేవాలని..!

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 7.9°c | 33.6°c |
| రంగారెడ్డి | 10.1°c | 34.1°c |
| మెదక్ | 10.2°c | 32.6°c |
| నిజామాబాద్ | 14.0°c | 31.1°c |
| హైదరాబాద్ | 15.5°c | 28.5°c |
| మహబూబ్‌నగర్ | 16.0°c | 28.5°c |
| కరీంనగర్ | 16.0°c | 28.0°c |
| వరంగల్ | 16.0°c | 27.0°c |
| ఖమ్మం | 17.0°c | 29.0°c |
| నల్లగొండ | 17.8°c | 27.6°c |


## ప్రభుత్వం అన్నం పెట్టలేని దీనస్థితిలో ఉందా?

- ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతల అరెస్టు దారుణం
- ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం
- ప్రభుత్వ పెద్దల్లో మొదలైన వణుకు: ఎమ్మెల్సీ కవిత
- రేవంత్‌రెడ్డిది నియంతృత్వ పాలన: దాసోజు శ్రవణ్



హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాప్రతినిధులను అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని మాజీమంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలు జరుగుతున్న మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించేందుకు వెళ్తారనే నెపంతో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితోపాటు బీఆర్‌ఎస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఖండించారు. పాఠశాలలు సందర్శించడానికి వెళ్తే ప్రభుత్వానికి ఎందుకు అంత భయం? పురుగుల అన్నం మాకొద్దు అని విద్యార్థులు రోడ్డెక్కి నినదిస్తుంటే చీమకుట్టినట్టైనా లేదా? మంచి భోజనం పెట్టని దీనస్థితిలో ఈ ప్రభుత్వం ఉన్నదా? అని నిలదీశారు. అరెస్టు చేసిన రామ్మోహన్‌రెడ్డితోపాటు బీఆర్‌ఎస్ నాయకులకు విడుదల చేయాలి' అని బుధవారం ఎక్స్ వేదికగా హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 'ప్రతిపక్షాల గొంతు నొక్కడం కాదు.. ఫుడ్ పాయిజన్ వల్ల దవాఖానపాలైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించండి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోండి' అని సీఎం రేవంత్‌రెడ్డికి హితవుపలికారు.


### నిర్బంధాలతో అణిచివేయాలనుకుంటే మూర్ఖత్వం



తెలంగాణ గడ్డ పోరాటాల పురిటి గడ్డ. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటును అణిచివేయాలనుకోవడం ప్రభుత్వ మూర్ఖత్వం. 'చేసిన తప్పులకు ప్రజలు తిరగబడతారనే భయంతో ప్రభుత్వ పెద్దల్లో వణుకు పుడుతున్నది. మాగనూరు జడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్‌ఎస్ నేతలు ప్రశ్నిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది. ప్రజాపాలన అంటూ కాంగ్రెస్ పెద్దలు గొప్పలు చెప్పుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా' అని బుధవారం ఎక్స్ వేదిక కవిత పేర్కొన్నారు.

–కల్వకుంట్ల కవిత, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ

### నిరసన తెలపడం నేరమా?



విద్యార్థుల పక్షాన నిరసన తెలపడం నేరమా? రేవంత్‌రెడ్డి నియంతృత్వానికి ఇది పరాకాష్ట. మంగళవారం మరోసారి ఆహారం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయమై మాగనూరులో ధర్నాకు సిద్ధమవుతున్నారనే సమాచారంతో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణం.

–దాసోజు శ్రవణ్, బీఆర్‌ఎస్ నాయకుడు

## వేడినూనె పడి విద్యార్థినికి గాయాలు

నవాబ్‌పేట, నవంబర్ 27: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేటలోని కేజీబీవీ పాఠశాలలో మంగళవారం సిబ్బంది పూరీలు చేస్తుండగా, ఆలస్యమవడంతో టీచర్లు విద్యార్థులతో కూడా పూరీలు చేయించారు. దీంతో కడాయిలో పూరీలు వేసే క్రమంలో వేడి నూనె చిట్లి తొమ్మిదో తరగతికి చెందిన జల్సా అనే అమ్మాయిపై పడటంతో చేతికి, కాలికి గాయాలుకాగా బుధవారం వెలుగులోకి వచ్చింది. బుధవారం విద్యార్థిని తల్లి యాదమ్మ అమ్మాయిని తీసుకెళ్లి వైద్యం చేయించుకొని సొంతూరికి తీసుకెళ్లింది.

## 'భోజన' పర్యవేక్షణకు ఫుడ్ కమిటీ

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): మధ్యాహ్న భోజనం పర్యవేక్షణకు ఫుడ్ కమిటీని ఏర్పాటు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, టీచర్లతో కలిపి ఫుడ్ కమిటీని ఏర్పాటుచేశారు.

# విద్యార్థులపై సర్కారు విషప్రచారం

- చిరుతిళ్ల వల్లే దారుణాలని విద్యార్థులపై నింద
- హైకోర్టు సాక్షిగా చిన్నారులపై అసత్య ప్రచారం
- పదేండ్లలో లేని అస్వస్థత ఇప్పుడే ఎందుకు?
- విపక్ష, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల నిలదీత

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై ప్రభుత్వం బాధ్యత మరచి అసత్య ప్రచారానికి తెరలేపింది. విద్యార్థులపైనే విషప్రచారానికి దిగింది. విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాల్సిన ప్రభుత్వం ఇటీవలి పరిణామాలకు విద్యార్థులే కారణం అని నింద వేసేందుకు వెనుకాడలేదు. గురుకుల అస్వస్థతకు విద్యార్థులే కారణమని తేల్చేసింది. మహబూబ్‌నగర్ జిల్లా మాగనూరు హాస్టల్‌లో అస్వస్థత ఘటనకు విద్యార్థులు బయట చిరుతిళ్లు తినటమే కారణమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తేల్చేశారు. మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చి అస్వస్థతకు విద్యార్థులు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే 'కుర్‌కురేలు తినటం వల్లే ఇదంతా జరుగుతున్నది' అని న్యాయస్థానంలో ప్రభుత్వం వాదన వినిపించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై విపక్షాలు, విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ప్రభుత్వంపై ప్రశ్నలు ఎక్కుపెడుతున్నాయి. విద్యార్థులు చిరుతిళ్లు, కుర్‌కురేలు తింటుంటే వార్డెన్లు, ప్రిన్సిపాళ్లు ఏం చేస్తున్నారు? పదేండ్లలో ఎప్పుడూలేంది చిరుతిళ్లు ఇప్పుడే తింటున్నారా? హాస్టళ్లల్లో ఉండే పిల్లలే తింటున్నరా? ఇతర పిల్లలు తినడం లేదా? హాస్టళ్లలో లేని విద్యార్థులు చిరుతిళ్లు తింటే ఏమీ కాకుండా హాస్టల్ విద్యార్థులే ఎందుకు అస్వస్థతకు గురవుతున్నారు? రోజుకో చోట పదుల సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు ఎందుకు గురవుతున్నారు? అని విపక్ష, విద్యార్థి, ఉపాధ్యాయ నేతలు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ఏది జరిగినా బీఆర్‌ఎస్ కారణమని, బాధ్యత బీఆర్‌ఎస్‌దే అంటూ తప్పును కప్పిపుచ్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్న సర్కార్ ఉన్నఫలంగా విద్యార్థులపై ఇప్పుడు విషప్రచారానికి తెరతీయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఇవి చిరుతిళ్ల దారుణాలా?

రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిగా హాస్టళ్లల్లో జరిగిన 38 సార్లు ఫుడ్ పాయిజన్ ఘటనల్లో 886 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వాంకిడిలో విషాహారం తిని శైలజ అనే విద్యార్థిని చనిపోయింది. ఈ ఘటన మరవకముందే మహబూబ్‌నగర్ జిల్లాలో ఫుడ్ పాయిజన్ జరిగింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత హాస్టళ్లలో వివిధ కారణాలతో 48 మంది విద్యార్థులు మరణించారు. దుర్భరమైన ఒత్తిడి పరిస్థితులను తట్టుకోలేక 23 మంది విద్యార్థులు బలవన్మరాలకు పాల్పడ్డారు. 8 మంది అనుమానాస్పదంగా మృతి చెందారు. కలుషితాహారం తిని నలుగురు చనిపోయారు. మరో 13 మంది అనారోగ్యంతో మృత్యువాతపడ్డారు. ఇవన్నీ జరగటానికి విద్యార్థుల చిరుతిళ్లు, కురుకురేలే కారణమా? అని బీఆర్‌ఎస్ ప్రశ్నిస్తున్నది.

### ప్రభుత్వ నిర్లక్ష్యానికి నింద విద్యార్థులపైనా?

**విద్యాలయాల్లో** చోటు చేసుకుంటున్న పరిణామాలకు విద్యార్థులే కారణమనే రీతిలో సర్కార్ వ్యవహరించటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం తన నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకోవటానికి ఏం చేయాలో తోచక విద్యార్థులపై నెపం నెడుతున్నది. హాస్టళ్లలో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడాల్సిన ప్రభుత్వం పర్యవేక్షణ మరచి వారిపై విషప్రచారానికి వెనుకాడని తీరుపై సమాజం భగ్గుమంటున్నది. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ఎప్పటికప్పుడు హాస్టల్ స్థితిగతులను పర్యవేక్షించి బాధ్యతను ప్రభుత్వం గాలికి వదిలేయటం వల్లే పరిస్థితులు ఇలా మారాయనే ఆరోపణలకు బలం చేకూరుతున్నది. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో విద్యాసంవత్సరం ప్రారంభంనుంచి మంత్రులు సమీక్షలు జరిపేవారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జిల్లాల వారీగా పర్యటనలు చేసినప్పుడు హాస్టళ్లను తనిఖీ చేసేవారు. తక్షణ చర్యలపై అక్కడికక్కడే ఆదేశాలు ఇచ్చేవారు. ఫలితంగా అందరూ అప్రమత్తంగా ఉండేవారు. పదేండ్లపాటు విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవటం వల్ల మంచి ఫలితాలు వచ్చి గురుకులాలపై క్రేజ్ పెరిగింది. కానీ ఏడాది కాలంలోనే పరిస్థితులు తలకిందులయ్యాయి.

# పిల్లలతో చెలగాటమా?

మొదటిపేజీ తరువాయి...

కదలిక రాదా?' అని మండిపడింది. 'పాఠశాలల్లో పిల్లలకు పెట్టే ఆహార నాణ్యత బాగుంటే వాళ్లు ఎందుకు అనారోగ్యానికి గురౌతారు? పిల్లలు ఆహారం తిన్నాక దవాఖానపాలు కావడం ఒకసారి కాదు, రెండుసార్లు కాదు ఏకంగా మూడుసార్లు జరిగిందంటే ఏమనుకోవాలి? వారంలో మూడుసార్లు భోజనం వికటిస్తుందా? ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అర్థం అవుతున్నది కదా? అధికారులు నిద్రపోతున్నారా? అధికారులు మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నట్టు అనిపిస్తున్నది' అంటూ ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఆ ఘటనలపై వివరాలు ఇవ్వమంటే వారం రోజుల గడువు కావాలని ప్రభుత్వం కోరడం ఏమిటో అర్థం కావడం లేదు. నారాయణపేట డీఈవో, ఇతర ఆఫీసర్ల దగ్గర సెల్‌ఫోన్లు లేవా? ఏ యుగంలో ఉన్నాం. అత్యాధునిక సౌకర్యాలు ఉన్నప్పుడు కూడా వివరాలు ఇవ్వడానికి వారం రోజులు కోరడం ఏమిటి? దీనిని బట్టే ప్రభుత్వం ఎంత నిర్లిప్తంగా ఉందో స్పష్టం అవుతున్నది. పాలకులు, అధికారుల పిల్లలకు ఇలా జరిగితే ఊరుకుంటారా? అధికారులకు కూడా పిల్లలుంటారు కదా. ఇదేనా పేద పిల్లలు చదువుకోవాలనే ఆశల్ని చిగురింపజేసే విధానం?' అంటూ నిలదీసింది. 'ఇంత తీవ్రమైన ఘటనపై వివరాలు ఇవ్వడానికి ఏడు రోజులు ఎందుకు? ఒక జిల్లా స్థాయి అధికారి నుంచి పూర్తి వివరాలు తెప్పించడానికి వారం రోజులు కావాలా? నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఐదే ఐదు నిమిషాల్లో ఇక్కడ ఉంటారు!' అంటూ నిప్పులు చెరిగింది. 'ప్రభుత్వం మన్ను తిన్న పాములా మిన్నకుంటుందా? మాకే కనుక ఈ వ్యవహారాన్ని అప్పగిస్తే తక్షణమే జిల్లా విద్యా శాఖాధికారిని సస్పెండ్ చేస్తాం' అని ఘాటుగా స్పందించింది. పది నిమిషాలు గడువు ఇస్తున్నామని, ఈలోగా ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ హాజరుకావాలని ప్రభుత్వ న్యాయవాదికి తేల్చి చెప్పింది.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతికి నిరసనగా విద్యార్థి నాయకులు బుధవారం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్ వద్ద పోలీసులు అడ్డుకోవడం కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్నది. జిల్లావ్యాప్తంగా కూడా నిరసనలు కొనసాగాయి.

### ప్రభుత్వానికి ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి

మీకు పిల్లలు ఉన్నారా. ఉంటే ఇలాగే చేస్తారా, మీకు బాధ్యత ఉందా, ఉంటే కూడా ఇలా చేస్తారా, ప్రభుత్వం సిగ్గు పడాలి. వారంగడువు కావాలా, మైనస్ 30 డిగ్రీలుండే వేల మైళ్ల దూరంలో అధికారులు ఉన్నారా, మాగనూరు ఎంత దూరంలో ఉంది. అక్కడ వైఫై వంటి సౌకర్యాలు ఉన్నాయని చెప్తున్నారు, మాగనూరు ఒకే స్కూల్‌లో వారంలో3 సార్లు మీరు పెట్టిన ఆహారం వల్ల అస్వస్థతకు గురౌతుంటే, డీఈవో, ఫుడ్ ఆఫీసర్స్, నోడల్ ఏజెన్సీ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కం కమిషనర్, తనిఖీ అధికారులు ఏం చేస్తున్నారు? మధ్యాహ్న భోజన కమిటీలు ఏం చేస్తున్నాయి? అంటూ హైకోర్టు ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించింది.

### నిబంధనలు అమలుకావడం లేదు

ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు, ఐసీడీఎస్ పథకం అమలుకు సంబంధించిన జీవో వన్ (1) గురించి హైదరాబాద్‌కు చెందిన హెల్ప్ ది పీపుల్ అనే సంస్థ అధ్యక్షుడు కే అఖిల్ శ్రీగురుతేజ దాఖలుచేసిన ప్రజాహిత వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. తొలుత పిటిషనర్ తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు ఘోరంగా ఉందని చెప్పారు. నారాయణపేట జిల్లా మాగనూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 21, 24, 26న విద్యార్థులు ఆహారం తీసుకున్నాక దవాఖానపాలయ్యారని చెప్పారు. ఒకే స్కూల్‌లో వారం వ్యవధిలో వరుసగా మూడు ఘటనలు జరిగాయని తెలిపారు. అధికారులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని, పాలకులు పట్టించుకోవడం లేదని చెప్పారు. నిబంధనలను కచ్చితంగా అమలు చేయడంలో వైఫల్యం చెందారని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని మరో పాఠశాలలో కూడా అదే మాదిరిగా విద్యార్థులు మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. అన్ని పాఠశాలల్లో తల్లి లేదా తండ్రి ఉండే గవర్నింగ్ బాడీ ఉండాలన్న ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధన కూడా అమలు కావడం లేదని తెలిపారు. అదనపు ఏజీ ఖాన్ స్పందిస్తూ, మాగనూరు పాఠశాలలో రెండు ఘటనలే జరిగాయని అన్నారు. విద్యార్థులు బయట జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల ఒకసారి అస్వస్థతకు గురయ్యారని చెప్పారు. మాగనూరు ఘటనలో ఒక ఉపాధ్యాయుడ్ని ప్రభుత్వం సస్పెండ్ చేసిందని, మధ్యాహ్న భోజనం సరఫరా చేసే వాళ్లను మార్చిందని వివరించారు. రెండుచోట్ల జరిగిన మూడు ఘటనలపై పూర్తి వివరాలు, బాధ్యులపై తీసుకున్న చర్యలతో సమగ్రంగా అఫిడవిట్ దాఖలు చేస్తామనగా, విచారణను డిసెంబర్ 2కు వాయిదా పడింది.

### వారం గడువు అడిగేందుకు సిగ్గుపడాలి

మాగనూరు ఘటనపై నివేదిక ఇచ్చేందుకు వారం గడువు కావాలని ఏజీపీ నాగార్జున కోరడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మాగనూరు ఎంతదూరంలో ఉందని, ఇంటర్నెట్, వైఫై వంటి వసతులు ఉన్న ప్రాంతామేనా అని ఆరా తీసింది. హైదరాబాద్‌కు సుమారు 70 కిలోమీటర్ల దూరంలోనే మాగనూరు ఉందని, ఇంటర్నెట్ వంటి అన్ని వసతులు ఉన్నాయని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ చెప్పారు. 'వారం రోజులు గడువు అడిగేందుకు సిగ్గుపడాలి. అధికారులకు పిల్లలు లేరా? పిల్లలు చనిపోతేగానీ స్పందించరా? మేము గనుక నాన్ బెయిలబుల్ వారెంట్ జారీచేస్తే ఈ రోజే మధ్యాహ్నానికి అధికారులు విచారణకు హాజరవుతారు' అని ధర్మాసనం హెచ్చరించింది. మైనస్ 30 డిగ్రీలు ఉండేంత దూరంలో ఏమైనా మాగనూరు ఉందా? అని నిలదీసింది. మీకు పిల్లలు లేరా, మీ పిల్లలకు ఇలా జరిగితే కూడా ఇలాగే ఉంటారా? పేద ప్రజలను ప్రైవేట్ స్కూల్స్‌లో చదివించలేక ప్రభుత్వ బడులకు పంపితే ఇలాంటి కలుషిత ఆహారం పెడతారా? అని నిప్పులు చెరిగింది. విచారణకు అడ్వకేట్ జనరల్ హాజరై వివరణ ఇవ్వాల్సిందేనని తేల్చి చెప్పింది. పావుగంట తర్వాత అదనపు అడ్వకేట్ జనరల్ మహ్మద్ ఇమ్రాన్‌ఖాన్ విచారణకు హాజరై పూర్తి వివరాలు తెలుసుకుని నివేదించేందుకు వీలుగా విచారణను మధ్యాహ్నానికి వాయిదా వేయాలని కోరారు. భోజన విరామం తర్వాత విచారణ చేపట్టింది. ఏఏజీ ఖాన్ వాదనలు వినిపించారు. ఈ సమయంలో చిక్కుడు ప్రభాకర్ కల్పించుకుంటూ మాగనూరులో ఈ నెల 21న 50 మంది, 24న 70, 26న 27 మంది చొప్పున విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వివరించారు. మూడుసార్లు వరుసగా ఒకే స్కూల్ విద్యార్థులు దవాఖానపాలయ్యారని, ఇది ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమని చెప్పారు.